# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో పీపీపీ విధానంలో నిర్మించ తలపెట్టిన వైద్య కళాశాలల నిర్మాణ పనులు నెల రోజుల్లోగా ప్రారంభమవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా 6 వేల కోట్ల రూపాయలతో నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం జరుగుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.
- ❖ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు ఈరోజు మృతి చెందారు.
- ❖ రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ప్రజలు తగు జాగ్రతలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

=====================

రాష్ట్రంలో పీపీపీ విధానంలో నిర్మించ తలపెట్టిన వైద్య కళాశాలల నిర్మాణ పనులు నెల రోజుల్లో ప్రారంభించేలా ఆయా సంస్థలకు అప్పగించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ముందుగా ఫేజ్-1 లోని 4 మెడికల్ కాలేజీలు మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని పనులు మొదలు పెట్టాలని స్పష్టం చేశారు. అదే విధంగా ఫేజ్-2లో అమలాపురం, బాపట్ల, పెనుకొండ, నర్సీపట్నం, పాలకొల్లు, పార్వతీపురం మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. 7 ప్రధాన అంశాలతో ఏపీ స్టేట్ హెల్త్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ 2026-31 త్వరలోనే తీసుకురావాలని నిర్దేశించారు. ఇందులో భాగంగా వైద్య కళాశాలలు, మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్, మెడ్ టెక్ ఉత్పాదనలు, మెడికల్ టూరిజం కింద ఇంటిగ్రేటెడ్ వెల్నెస్ ఫెసిలిటీ సెంటర్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. అమరావతిలో నేచరోపతి సంస్థ నెలకొల్పేలా ఆయుష్ శాఖ మంత్రిత్వ శాఖకు లేఖ రాయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. రాష్ట్ర సచివాలయంలో సంజీవని ప్రాజెక్టుపై ఈరోజు జరిపిన సమీక్ష సందర్భంగా చంద్రబాబు నాయుడు ఈ ఆదేశాలు జారీ చేశారు.

=====================

రాష్ట్రంలో పాపులేషన్ మేనేజ్మెంట్ విధానం అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని సచివాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.5 సగటుతో టోటల్ ఫెర్టిలిటీ రేటు నమోదు అయినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిని 2.1కి పెంచడానికి తగిన కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జనాభా నియంత్రణ నుంచి జనాభా సంరక్షణ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి కుటుంబాలకు అధిక ప్రోత్సాహకాలు, ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జనాభా నిర్వహణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. అలాగే సమతుల్య ఆహారం తీసుకోకపోవడం వల్ల ఎక్కువ మంది అనారోగ్యం పాలవుతున్నారని, పోషకాహారం-ప్రివెంటివ్ హెల్త్ పై దృష్టి పెట్టేలా చూడాలన్నారు.

======================

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలో ఈరోజు పర్యటించారు. రాచెర్లలో 220/132 కేవీ సబ్ స్టేషన్ ను మంత్రి ఈ సందర్భంగా ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... రాచెర్ల సబ్ స్టేషన్ ద్వారా చుట్టు పక్కలున్న పరిశ్రమలకు లో-ఓల్టేజ్ సమస్యలు ఉండవన్నారు. గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని.. రాష్ట్ర వ్యాప్తంగా 6 వేల కోట్ల రూపాయలతో నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం జరుగుతోందన్నారు. పారిశ్రామిక రంగానికి సరిపడా విద్యుత్ అందిస్తే... రాష్ట్రానికి పెద్ద ఎత్తును పెట్టుబడులను ఆకర్షించవచ్చని చెప్పారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు 2 కిలోవాట్ చెప్పున పీఎం సూర్యఘర్ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. మరో మూడు నెలల్లో 6 లక్షల పీఎం సూర్యఘర్ కనెక్షన్ల లక్ష్యాన్ని చేరుకుంటామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతోహైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు తుదిశ్వాస విడిచారు. 1935లో గుంటూరులో జన్మించిన ఆయన వృత్తిరీత్యా న్యాయవాది. 1978లో కాంగ్రెస్ పార్టీ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. ఆ తరువాత 1984లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి 11వ ముఖ్యమంత్రిగా నెలరోజుల పాటు సేవలు అందించారు. అంతకుముందు మర్రి చెన్నారెడ్డి, టి. అంజయ్య మంత్రివర్గాలలో కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. 1982లో ఏర్పాటు అయిన తెలుగుదేశం పార్టీ నిర్మాణంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. నాదెండ్ల భాస్కర్‌రావు మృతి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. భాస్కరరావు కుమారుడు, క్యాబినెట్ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. భాస్కరరావు మృతిపై ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సంతాపం ప్రకటించారు.

విరామం

======================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు అనకాపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. రాంబిల్లి మండల పరిధిలోని ఏపీఐఐసీ ఆర్థిక మండలిలో 5 వేల 400 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్న "రెన్యూ ఎనర్జీ గ్లోబల్" సంస్థ భూమి పూజలో పాల్గొంటారు. క్లీన్ ఎనర్జీ రంగంలోని ప్రధాన సంస్థల్లో ఒకటిగా ఉన్న రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఇప్పటికే దేశంలో 19.2 గిగావాట్ల సామర్థ్యంతో వివిధ ప్రాంతాల్లో క్లీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. ఇక రాంబిల్లిలో 6 గిగా వాట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ 2,100 మందికి ఉపాధి కల్పించనుంది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అన్ని విభాగాలను సమన్వయపరుచుకొని విస్తృత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. డీఐజీ గోపీనాథ్ జట్టి, ఎస్పీ తుహిన్ సిన్హాలతో కలిసి కలెక్టర్ ఈరోజు క్షేత్రస్థాయి పరిశీలన చేసి.. అధికారులతో సమీక్ష నిర్వహించారు. అదే విధంగా 27వ తేదీన ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు కూడా ముఖ్యమంత్రి హాజరవుతారు. ఆ మరుసటి రోజు ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

======================

మహిళలను వేధింపులకు గురిచేసే వారికి కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ హెచ్చరించారు. విజయవాడలోని డాక్టర్ నోరి రామ శాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రొఫెసర్ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడంటూ పలువురు విద్యార్థునుల నుంచి మహిళా కమిషన్ కి ఫిర్యాదు రావడంతో ఈరోజు ఆమె కళాశాలలో పర్యటించి, విద్యార్థునులతో విడివిడిగా సమావేశమయ్యారు. అనంతరం రాయపాటి శైలజ పాత్రికేయులతో మాట్లాడుతూ... ఇక్కడి ఫాకల్టీ కొంతమంది లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారంటూ విద్యార్థునులు మహిళా కమిషన్ కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారని తెలిపారు. దీని మీద విచారణ జరిపి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాజంలో ఏ ఒక్క మహిళ కూడా బాధపడకుండా ఉండేలా రాష్ట్ర మహిళా కమిషన్ కట్టుబడి పని చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో లైంగిక వేధింపులకు సంబంధించి ఫిర్యాదు చేసేందుకు క్యూఆర్ కోడ్ సిస్టమ్ ను సిద్ధం చేస్తున్నట్లు రాయపాటి శైలజ వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

======================

రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ప్రజలు తగు జాగ్రతలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. కడపలో ఈరోజు అత్యధికంగా 44.4°C, సాలూరులో 44.1°C, ఆళ్లగడ్డలో 44°C, శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో 43.5°C, విజయనగరం జిల్లా దత్తిరాజేరులో 43.5°C చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలన్నారు. అదే విధంగా కళ్ళ రక్షణ కోసం నాణ్యమైన సన్ గ్లాసెస్ ఉపయోగించాలన్నారు. గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ రసం, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఇక రేపు శ్రీకాకుళం జిల్లాలో 19, విజయనగరంలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 5 మండలాల్లో తీవ్ర వడగాలుల ప్రభావం చూపే అవకాశం ఉందని వెల్లడించారు.

======================
======================